క్లుప్తంగా

నేడు శివపార్వతుల కల్యాణం

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో గల సోమేశ్వర ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ జంగం యాదవ్, సభ్యులు శివరాజ్, రాజయ్యలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయమే శ్రీ పార్వతీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల భక్తులు హాజరు కావాలని సూచించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

షాబాద్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మండలంలోని పెద్దవేడు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో సీఆర్ఆర్ నిధులు రూ.30లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ప్రతి పల్లెలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, యాదయ్య, సత్తయ్య, యాదయ్యగౌడ్, కృష్ణగౌడ్, నానిగౌడ్, జి.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వల్లో పూడిక తీయండి

కొత్తూరు: ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో వరద నీరు సక్రమంగా ప్రవహించేందుకు వీలుగా మురుగు కాల్వల్లో పూడికను తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ శుక్రవారం ఓ ప్రకటనలో అధికారులను కోరారు. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పాలన కొనసాగిస్తున్నట్లు వివరించారు. కొన్ని నెలలుగా సిబ్బంది మున్సిపాలిటీతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లోని మురుగు కాల్వల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం లేదన్నారు. దీంతో చిన్న వర్షాలు కురిసిన కాల్వల్లో నీరు వెళ్లకుండా రోడ్లపై ప్రవహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్ వినియోగించుకోండి

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామశివారులోగల మూన్‌రే ఫార్మసీ కళాశాలలో జూన్ 14న క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌ను దివీస్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రముఖ ఫార్మా సంస్థగా ఉన్న దివీస్ ల్యాబొరేటరీస్‌లో ఉద్యోగావకాశాలు దక్కించుకోవడం ఎంతో గర్వకారణమని వివరించారు. బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఎస్సీ, ఎంఎస్సీ పూర్తి చేసిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మూన్‌రే కళాశాల విద్యార్థులే కాకుండా సమీప ప్రాంతాల నుంచి వచ్చిన గ్రాడ్యుయేట్‌లకు అవకాశం ఉందన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్

షాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెర వేర్చాలని బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



కమిషనర్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి

చేవెళ్ల: మున్సిపాలిటీలో కలిసిన అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ అన్నారు. పామెన గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వార్డు కార్యాలయంలో మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి కమిషనర్‌ను సన్మానించి స్వాగతం తెలిపారు. గ్రామంలో ఉన్న సమస్యలపై కమిషనర్ తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఆరా తీశారు. మున్సిపాలిటీలో విలీనంతో గ్రామం పట్టణంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పామెన గ్రామస్తులు, నాయకులు ఉన్నారు.



తిమ్మారెడ్డిగూడలో దుక్కి దున్నుతున్న రైతు



షాబాద్‌లో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

వ్యవసాయ పనులు షురూ

- రోహిణి కార్తెలోనే జోరుగా కురుస్తున్న వర్షాలు
- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్ల సందడి
- పత్తి సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు

షాబాద్: రోహిణి కార్తెలో ఎండ వేడిమితో రోళ్లు పగులుతాయని అంటారు. కానీ అందుకు భిన్నంగా ఈసారి జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. తొలకరి పలకరింపుతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈసారి రోహిణి కార్తెలోనే వర్షాలు జోరుగా కురవడంతో ముందుస్తుగానే పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. విత్తనాలు నాటేందుకు పొలాలను చదును చేసే పనులు జోరుగా సాగుతున్నాయి. షాబాద్ మండలంలో సుమారు 50 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా నల్లరేగడి భూములు ఉండడం వల్ల రైతులు పత్తి సాగుకు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం గ్రామాల్లో కోడెరువు చల్లడం, భూములు చదును చేసుకోవడం పనులు చేపడుతున్నారు. విత్తనాలు నాటేందుకు సంసిద్ధం అవుతున్నారు. కొన్ని గ్రామాల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఈ పంటకి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దుక్కులు దున్నకాలు, మెట్ట భూముల్లో పత్తి, వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరికొందరు ఎరువులు, విత్తనాల కొనుగోలులో బిజీగా ఉన్నారు. ఈ వానాకాలంలో మండల వ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

ముందస్తుగానే రుతుపవనాలు

ఈసారి రోహిణి కార్తెలో వర్షాలు కురుస్తున్నాయి. గత ఏడాది జూన్ 3న నైరుతి రుతుపవనాలు రాకతో వానలు ప్రారంభం అయ్యాయి. ఈ సారి మే 23వ తేదీనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. వీటి ప్రభావంతో మండలంలో గత వారం రోజులుగా వానలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పొలంబాట పట్టారు. కొంతమంది మాత్రం పంటకాలానికి విరుద్ధంగా ప్రకృతి స్పందిస్తుందని వాపోతున్నారు.

పత్తి పంట వేశాను



రోహిణి కార్తెకు ముందునుంచే వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు కూడా తొందరగానే ప్రారంభించాం. ఈసారి 3 ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటాను. ముందుగా కురుస్తున్న వర్షాలతో సాగు మొదలుపెట్టాం. సకాలంలో వర్షాలు కురిస్తే పత్తి లాభదాయకమే.

– శేఖర్, రైతు, తిమ్మారెడ్డిగూడ

రసీదులు తప్పనిసరి



మండలంలో నకిలీ విత్తనాలను అరికడుతున్నాం. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాం. బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు అమ్మితే మా దృషికి తీసుకురావాలి. రైతులకు సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి.

– వెంకటేశం, ఏఓ, షాబాద్

సమాజానికి మహిళాశక్తి అవసరం



నియామకపత్రాలు అందజేస్తున్న జలజ

జీసీ సేన మండల అధ్యక్షురాలు జలజ

షాద్‌నగర్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీసీ సేన మండల అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ, మధురాపూర్, గంట్లవెళ్లి గ్రామాల్లో బీసీ సేన నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు, పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళా శక్తిని సమాజానికి చాటాల్సిన అవసరం ఉందన్నారు. కొండన్నగూడ, మధురాపూర్, గంట్లవెళ్లి గ్రామాల్లో బీసీ సేన మహిళా అధ్యక్షులుగా కుమ్మరి చెన్నమ్మ, సద్దుల మహేశ్వరి, మంగలి లావణ్య, ఉపాధ్యక్షులుగా శంకరమ్మ, జ్యోతి, పుష్ప, ప్రధాన కార్యదర్శులుగా బాలమణి, పారిజాతం, స్వాతితో పాటుగా సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

చలివేంద్రంపల్లి కమిటీ ఏర్పాటు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని చలివేంద్రంపల్లి గ్రామంలో శుక్రవారం బీసీ సేన మండలాధ్యక్షులు ప్యాట జయ ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా కుమ్మరి భీమమ్మ, ప్రధాన కార్యదర్శిగా మాధవి, ఉపాధ్యక్షురాలుగా పద్మమ్మ, సహాయ కార్యదర్శిగా అంజమ్మ, కోశాధికారిగా అహ్మద్‌బీ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం ఏర్పాటుకు స్థలం ఇవ్వండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: పట్టణంలో అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఫరూఖ్‌నగర్ ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నియోజకవర్గ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాల పోరాట ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు. ఉద్యమ పోరాటంలో ఎంతో మంది అమరులు అయ్యారన్నారు. వారి జ్ఞాపకార్థం అమరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. దీనికి అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, రవికుమార్‌గౌడ్, నర్సింలు, రవి, బాలు నాయక్, మల్లేష్, ఎల్లోజి, కొరమేష్, శేఖర్, రవిశంకర్, శివకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

కొత్తూరు: మండలంలోని ఆయా పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా పరిశ్రమల యాజమాన్యాలను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్థానికంగా కొనసాగుతున్న పలు పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వారిని 12 గంటలు పనిచేయిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నట్లు ఆరోపించారు. కార్మికశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య సూచించారు. ఆమె శుక్రవారం కౌన్సిలర్లతో కలిసి పలు వార్డుల్లో భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపల్ సాధారణ నిధులు రూ.20 లక్షలతో నాలుగు వార్డుల్లో డ్రైనేజీ పైప్‌లైను పనులు చేపడుతున్నట్లు వివరించారు. నిధుల లభ్యతను బట్టి మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో మున్సిపాలిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లు, ఇళ్ల మధ్యన వరద నీరు నిల్వ లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణలో వ్యాపారులు, ప్రజలు మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు కరుణశ్రీ, జయమ్మ, నర్సింలు, సోమ్లానాయక్, నాయకులు దేవేందర్‌యాదవ్, జనార్దన్‌చారి, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్‌గౌడ్, రవినాయక్ పాల్గొన్నారు.

పుస్తెమెట్టెల అందజేత



పుస్తెమెట్టెలు అందజేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: నిరుపేద కుటుంబంలో జరుగుతున్న పెళ్లికి మండలంలోని పాపిరెడ్డిగూడకు చెందిన మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి చేయూతనిచ్చారు. గ్రామానికి చెందిన సూరమోని సువర్ణ కూతురు వివాహం గ్రామంలో శుక్రవారం జరిగింది. పెళ్లి కూతురు కుటుంబం నిరుపేదలు కావడంతో పుస్తె మెట్టెలను మాజీ సర్పంచ్ అందజేశారు. కార్యక్రమంలో శంకర్, నరేందర్‌జీ, చిన్నారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌జీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

మొయినాబాద్: డిగ్రీ ఫలితాల్లో సిద్ధార్థ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మొయినాబాద్‌లోని సిద్ధార్థ కళాశాలకు చెందిన విద్యార్థులు బీకాంలో సబియా 9.76 జీపీఏ, మహేశ్వరి 9.48, శివాని 9.43, ఇమ్రాన్ 9.32, నేహాబేగం 9.32, పూజ 9.25 జీపీఏ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ పర్మటి ఆంజనేయులు, కరస్పాండెంట్ ఉమాకాంత్, డైరెక్టర్లు రామకృష్ణ, లింగం, అధ్యాపకులు మహేందర్, రవి, షీలా, మోసు తదితరులు అభినందించారు.



సబియా 9.76



మహేశ్వరి 9.48



శివాని 9.43



నేహాబేగం 9.32



పూజ 9.25

వైభవంగా కలశ ప్రతిష్ఠ

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే యాదయ్య పూజలు

చేవెళ్ల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండలంలోని తంగడపల్లిలో శ్రీ దశావతార సమేత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి రాజగోపుర కలశ ప్రతిష్ఠ, బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయం నుంచి సాయంత్రం ఆలయం వద్ద గ్రామస్తులు పూజారులతో వేద మంత్రోచ్చారణల నడుమ హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే ఆలయాలతో ప్రజలకు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రజలంతా కలిసిమెలిసి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటున్నారని ఆలయ ప్రధాన అర్చకులు వెంకటాచర్యులు, శేషాద్రిచార్యులు వేణుగోపాల్‌చార్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



కనకమామిడిలో ఇంటి నిర్మాణపూజలో కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి, కాశీంబౌలి గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు నాయకులు ముగ్గుపోసి నిర్మాణ పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు జరుగుతుంటే చూసి ఓర్వలేక ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం సరి కాదన్నారు. విమర్శలు మానుకొని అభివృద్ధికి సహకరించాలని విపక్షాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, జయరామ్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, భిక్షపతి, నరేందర్, నిరంజన్‌రెడ్డి, మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన బోధన



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్, ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని ఎంఈఓ మనోహర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ కాంప్లెక్స్ పరిధిలోని కర్షం కుంటతండా, వాచ్యతండా, పుల్చర్లకుంటతండా, గిరాయిగుట్టతండా, ఉప్పరిగడ్డతండా, పటేల్‌కుంట తండాల్లో శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి.. సర్కారు బడులలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తెలియజేశారు. అనంతరం ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటయ్య, నర్సింలు, చంద్రశేఖర్, జనార్దన్‌రెడ్డి, సత్యం, సురేష్‌గౌడ్, మేఘాబాయి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, అనురాధ, శైలజ, అనూష, మనీలా, అనూష, సీఆర్పీ పాండునాయక్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం అర్జీల్లో మార్పులు



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీ అనురాధ

కొందుర్గు: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల్లో కొన్ని యూనిట్లు మార్పులు చేసుకునే అవకాశం ఉందని ఎంపీడీఓ లక్ష్మీ అనురాధ సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు సంబంధించి మండలానికి రూ.4 లక్షల యూనిట్లు టార్గెట్ 50 ఉండగా 681 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. రూ.3 లక్షల యూనిట్లు 42 ఉండగా 127 దరఖాస్తులు, రూ.2 లక్షల యూనిట్లు 80కి గాను 214 అర్జీలు వచ్చాయన్నారు. రూ.లక్ష యూనిట్లు 95 ఉండగా 62 దరఖాస్తులు, రూ.50 వేల యూనిట్లు 99 ఉండగా కేవలం 15 అర్జీలు మాత్రమే అందాయని వివరించారు. ఈ సందర్భంగా శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి యువ వికాసం రూ.4 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు రూ.50 వేలు, రూ.లక్ష యూనిట్ల కోసం మార్పు చేసుకోవానికి వస్తే, వారి నుంచి అంగీకారపత్రం తీసుకోవాలని సూచించారు. రూ.50 వేలు, రూ.లక్ష యూనిట్లకు బ్యాంకర్ల ఒప్పందం లేకున్నా ప్రభుత్వం నుంచి సబ్సిడీ మంజూరు అవుతుందన్నారు. ఈ విషయమై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా మండలానికి 495 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని త్వరలోనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ విజయ్ కుమార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

కృతిమ ఎరువులు తగ్గించాలి

ప్రొ.జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు



షాబాద్: రైతులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

షాబాద్: రైతులు కృతిమ ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మక్తగూడ, పెద్దవేడు గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంచాలకులు డాక్టర్ బల్‌రాం, శాస్త్రవేత్తలు సతీశ్, శిరీష, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు సమాఖ్య సంస్థలను స్థాపించాలని, అవసరమైన ఎరువులు ముఖ్యంగా యూరియా, డీఏపీ, పురుగుల మందులు వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించొచ్చని చెప్పారు. అధునాతన వ్యవసాయ పద్ధతులు అవలంబించి పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలని సూచించారు. వానాకాలంలో వరి పండిస్తే యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలన్నారు. పంట కోతల తర్వాత జీలుగ వేసి దుక్కి చేయడం ద్వారా ఎరువుల వాడకం 50 శాతం వరకు తగ్గించొచ్చని వివరించారు. అనంతరం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలకు సంబంధించి కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓలు గీత, రాజేశ్వరి, కిరణ్మయి, రీసెర్చ్ స్కాలర్స్ అవనిజ, శివప్రసాద్, విద్యార్థులు ప్రవీణ్ కుమార్, అజయ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో లాభాలు

నందిగామ: రైతులు తమ పంటల దిగుబడి కోసం రసాయన ఎరువులను అధికంగా వాడొద్దని వ్యవసాయ శాస్త్రవేత్త సుకుమార్ సూచించారు. మండల పరిధిలోని తాళ్లగూడలో ఏఓ శివరామరావు ఆధ్వర్యంలో శుక్రవారం రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సుకుమార్ రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏటా ఒకే రకమైన పంటలను వేయకుండా పంట మార్పిడి చేయాలని సూచించారు. పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదులు భద్రపర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ రవి, అగ్రికల్చర్ కాలేజీ టీచింగ్ అసోసియేట్ స్నేహలత, మమత, రైతులు తదితరులు పాల్గొన్నారు.